క్లుప్తంగా

జాషువా విగ్రహావిష్కరణ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పులికొండ గ్రామస్తులు

చీమకుర్తి: కవికోకిల గుర్రం జాషువా విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను బుధవారం పులికొండ గ్రామంలో ఆవిష్కరించారు. జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, బక్కా రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో లాయర్‌ను నియమించాలి



మాట్లాడుతున్న ఎంఆర్పీఎస్ నాయకులు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున లాయర్‌ను నియమించాలని చీమకుర్తి ఎంఆర్పీఎస్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల తరఫున వారి లాయర్లను నియమించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం తరఫున కూడా లాయర్‌ను నియమించి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం సహకరించాలని ఎంఆర్పీఎస్ నాయకులు పాటిబండ్ల జక్రయ్య, బక్కా రాజు, యోహాసువా, యువరాజు, కోటయ్య, శ్రీను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తర్లుపాడులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తర్లుపాడు: స్థానిక పోలెబోయినవారి బజారులో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే గడ్డివాములు ఉండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన మార్కాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన నాసరయ్య

దొనకొండ: టిప్పర్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెదన్నపాలెం చెరువుకట్ట, నాగమయ్య స్వామి గుడి వద్ద బుధవారం రాత్రి జరిగింది. తెలిసిన సమాచారం ప్రకారం.. దొనకొండ నుంచి పొదిలి వైపు టిప్పర్ వెళ్తోంది. వెంకటాపురం నుంచి దొనకొండకు పని కోసం చెట్టూరి బాల నాసరయ్య ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ప్రమాదంలో బాల నాసరయ్యకు కుడి మోకాలు తీవ్రంగా గాయమైంది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పోలీసు సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పేదలకు చేరువైన వైద్యం

- ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు సీఎం జగన్ కృషి
- మేయర్ గంగాడ సుజాత
- వెంగముక్కలపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు వైద్యాన్ని చేరువ చేశారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కొనియాడారు. స్థానిక 18వ డివిజన్‌లోని వెంగముక్కలపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం ఇళ్ల వద్దకే డాక్టర్లను పంపించి వైద్య సేవలు అందిస్తున్న విషయాన్ని వివరించారు. ఇలాంటి పద్ధతులను గతంలో ఏ ప్రభుత్వం కూడా నిర్వహించలేదన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని నూతనంగా తీసుకొచ్చారని గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి, అగ్రవర్ణాల్లోని పేదలు ఏ రకంగానూ రోగాలతో ఇబ్బంది పడకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేదలకు వైద్య సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, సర్జరీలు కూడా వేగంగా చేస్తున్నారని, కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్

ఒంగోలు రూరల్: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనేదే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ లక్ష్యమని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో లక్షల వ్యయంతో అందరికీ అందుబాటులో ఉండేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆ పథకాన్ని విజయవంతం చేసే బాధ్యత వైద్యశాఖ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందన్నారు. బుధవారం యరజర్లలో సర్పంచ్ రాములమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యదర్శి రామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పాల్గొని మాట్లాడారు. గత కొన్ని నెలలుగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి నెలా చికిత్స పొందిన వారి పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడం ద్వారా చికిత్స పొందిన వారి ఆరోగ్యం మెరుగుదల, చికిత్స మార్పు, ఇవ్వబడిన మందుల మార్పుల చేర్పులు జరుగుతాయన్నారు. దీర్ఘకాలిక రోగస్తుల గృహాలకు వెళ్లి డాక్టర్ సందర్శించడం ద్వారా వారి ఆరోగ్యం వేగంగా మెరుగవడంతో పాటు అవసరమైన సమయంలో ఫోన్ ద్వారా వైద్య సహాయాన్ని పొందవచ్చన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్న పోషకాహారం ఏ స్థాయిలో అందుతుందో పరిశీలించారు. చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి శ్రీనివాస్, స్థానిక ఏఎన్ఎంలు, సీహెచ్‌వో సిరి, ఫార్మసిస్ట్ శ్రీధర్, హెచ్ఈవో కృష్ణారెడ్డి, 104 సిబ్బంది, ల్యాబ్ అసిస్టెంట్ మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



పంటలను పరిశీలిస్తున్న రమేష్‌బాబు, కిషోర్‌బాబు, సిబ్బంది

ఒంగోలు రూరల్: ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, అందుకు రైతు భరోసా కేంద్ర సిబ్బంది సహకారం తీసుకోవాలని ఒంగోలు వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌బాబు సూచించారు. ఒంగోలు మండలంలోని గ్రామాల్లో ఒంగోలు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రమేష్‌బాబుతో కలిసి బుధవారం పంటల పరిశీలన చేశారు. యరజర్ల, వెంగముక్కలపాలెం, సర్వేరెడ్డిపాలెం, దశరాజుపల్లి, ముక్తినూతలపాడు గ్రామాల్లో రైతు సాగుచేసిన పంటలను పరిశీలించారు. పంటల నమోదు ప్రక్రియను సూపర్‌చెక్ చేశారు. శనగ, పొగాకు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని, పొరపాట్లు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. రైతులు వెంటనే ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. శనగ 5,760, పొగాకు 2,500, మినుము 590, వరి 780, ఇతర పంటలు 10,250 ఎకరాలను ఈ సీజన్‌లో సాగు చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె.రామకృష్ణారెడ్డి, వీపీఏలు శ్రీహరి, నాగమణి, బాబు, కోటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

చీమకుర్తి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చీమకుర్తి మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చీమకుర్తి సీఐ యు.దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం సాక్షితో ఆయన మాట్లాడుతూ చీమకుర్తి మండలంలోని ఇలపావులూరు, చంద్రపాడు, తొర్రగుడిపాడు, కూనంనేనివారిపాలెం, చినరావిపాడు, పాటిమీదపాలెం, గుడిపూడివారిపాలెం, గాడిపర్తివారిపాలెం గ్రామాలను సమస్యాత్మకమైన గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని కల్పిస్తూ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతో పాటు లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్లు చేయమని ఇప్పటికే ఆదేశించినట్లు సీఐ తెలిపారు. గ్రామాల వారీగా పర్యటించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగం కాదు.. పారిశ్రామికవేత్తలా మారాలి

ఒంగోలు: ఉద్యోగం పొందాలనే కాంక్షకన్నా పారిశ్రామికవేత్తగా జీవనం సాగించాలనే దృక్పథాన్ని విద్యార్థులు అలవరచుకోవాలని నిట్ వరంగల్ ప్రొఫెసర్ గుజ్జుల రాఘవేంద్ర సూచించారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాటిట్యూడ్, బిహేవియర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై మెకానికల్ మూడో సంవత్సరం విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. పరిశ్రమలు స్థాపించిన వారి అనుభవాలు తెలుసుకోవడం, పరిశ్రమల స్థాపనకు ఏమేం అవసరం, మంచి వ్యాపారవేత్తగా రాణించాలంటే ఎలాంటి ప్లానింగ్ ఉండాలి, పని బృందం ఏర్పాటు తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానమిచ్చారు.

రమాబాయి జయంతికి రక్తదానం



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జై భీమ్ ఫౌండేషన్ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మాతా రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జైభీమ్ ఫౌండేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మార్కెల్ల సుబ్బారావు, ప్రజా రచయిత డాక్టర్ మొగిలిదేవ ఇండియన్ రెడ్ క్రాస్ మహిళా విభాగం నాయకురాలు వడ్డేంపూడి సుజాత, కోసూరి శ్రీదేవి, రాయపాటి సంధ్య, మండవ లావణ్య పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితంలో ప్రతి విజయంలోనూ ఆయన భార్య రమాబాయి త్యాగం ఎంతో ఉందన్నారు. ఆమె తన బిడ్డలు అనారోగ్యంతో చనిపోయినా తన భర్త ఆశయ సాధన కోసం ఒక సమిధగా మారిందని కొనియాడారు. ఆమె త్యాగం భారత చరిత్ర ఉన్నంత వరకు శాశ్వతంగా నిలిచే ఉంటుందని పేర్కొన్నారు. రక్తదాన కార్యక్రమ నిర్వాహకులుగా చిక్కాల కిరణ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో కొండసింగు నాగరాజ్, ఆంజనేయులు, శీలం నవీన్, గోపాల్, అప్పు, అజయ్ సునీల్, వంశీసాయి, నాని, అనిల్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల లిస్టులను జల్లెడ పట్టండి



ఓటర్ల జాబితాపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సురేష్

కొత్తపట్నం: ఓటర్ల లిస్టులను జల్లెడ పట్టి పేర్ల తప్పులను సరిచేయాలని, డబుల్ ఎంట్రీలు, డెత్‌లను తొలగించాలని తహసీల్దార్ సురేష్ బీఎల్‌వోలు, ఎలక్షన్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. కొత్తపట్నం రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఓటర్ల జాబితాపై బీఎల్‌వోలు, ఎలక్షన్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఫారమ్ 6, 7, 8, 8ఏ గురించి వివరించారు. ప్రతి రోజూ ఓటర్ల లిస్టు తీసుకుని బూత్ పరిధిలో ఓటర్ల దగ్గరకు వెళ్లాలన్నారు. కొత్త ఓటర్లకు అర్హులైతే వారికి ఓటు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. చనిపోయిన వారు ఉంటే వారి పేరును పూర్తి సమాచారంతో తొలగించాలని చెప్పారు. వికలాంగులు, 80 సంవత్సరాలపైన వయసున్న వృద్ధులు ఉంటే వారికి ఇంటి దగ్గర ఓటును వినియోగించుకునే అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఎలక్షన్ సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

భిక్షాటన చేసుకునే దంపతులకు ఆర్థికసాయం

కొత్తపట్నం: భిక్షాటన చేసుకుంటూ జీవనం గడుపుతున్న భార్యాభర్తలకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం ఆధ్వర్యంలో బుధవారం కొంత నగదు అందజేశారు. వారిలో భర్తకు కళ్లు కనిపించకపోవడంతో భార్య అతన్ని నడిపించుకుని తీసుకెళ్తూ భిక్షాటన చేసుకుంటూ జీవిస్తుంటారు. ఒంగోలు చెందిన శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా వారికి ఆర్గనైజింగ్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు.

క్విస్ కాలేజీలో ఘనంగా ఫెస్ట్



విద్యార్థుల ప్రాజెక్టులు పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ జీవీఎల్ ప్రసాద్, తదితరులు

ఒంగోలు: స్థానిక క్విస్ కాలేజీలో ఫెస్ట్ 2024 తొలిరోజు కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సిలర్ డాక్టర్ జీవీఎల్ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ మంది విద్యార్థులతో ప్రారంభమైన కాలేజీ.. నేడు ఎన్‌బీఏ, నాక్ గుర్తింపుతోపాటు స్వయం ప్రతిపత్తిని సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించడం అభినందనీయమన్నారు. త్వరలోనే యూనివర్శిటీ స్థాయి గుర్తింపును కూడా సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూల్ డైరెక్టర్ డీవీఎల్ సోమయాజు, కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, ఇస్రో రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, కాలేజీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.గాయత్రి, క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దక్షిణామూర్తి, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ ఎల్.భారతి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా!



నాగిరెడ్డిని పరామర్శిస్తున్న దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి (ముండ్లమూరు): వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పని చేసి అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని యర్రఓబనపల్లి, అగ్నిపురి కాలనీ గ్రామాల్లో బుధవారం పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. యర్రఓబనపల్లి గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పేరం వెంకటరెడ్డిని, ప్రమాదంలో గాయపడిన కైపు బ్రహ్మరెడ్డిని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పేరం బాలనాగిరెడ్డిలను పరామర్శించి ఓదార్చారు. చీమలదిన్నె వెంకటస్వామి, బేళ్ల పరమేష్, మెలికా శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిపురి కాలనీకి చెందిన గూడూరి విక్టోరియా, గుంటూరి వెంకటేష్, మురికిపూడి శాంసన్, భాగ్యరాజు, గుంటూరి ఎలీశమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

రామిరెడ్డికి బూచేపల్లి పరామర్శ

దర్శి పట్టణంలోని కొత్తపాలెంలో వెన్నపూస రామిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి అక్కడికి చేరుకొని సుబ్బారెడ్డి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామిరెడ్డికి ధైర్యం చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ కైపు నాగేశ్వరమ్మ సుబ్బారెడ్డి, నాయకులు బాదం రమణారెడ్డి, చీమలదిన్నె కొండయ్య, గుంటూరి విల్సన్, సమాధానం పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం పుష్యమాసం ఉత్తరాషాఢ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

తీరం వద్ద గుర్తు తెలియని మృతదేహం

వేటపాలెం: రామాపురం సముద్రతీరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
90102 24456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
APE AUTO DX BS VI
2022 MODEL AP39 UJ 0250
Cell : 99594 43604
37-1-14, 2nd Floor, Vara Prasad Complex, Beside East KB Restaurant, Trunk Road, ONGOLE.

అమృతమూర్తికి అశ్రుతాంజలి



కీ॥శే॥ శ్రీ శిద్దా వెంకట సుబ్బారావు గారు
మరణం: 29-01-2024
మంచికి మారుపేరుగా, ప్రేమానురాగాలకు ప్రతిరూపముగా అందరికీ నేనున్నానంటూ చేయూతనిచ్చిన సహృదయులు, అందరి మంచిని కోరుకునే మంచి మనిషి కీ॥శే॥ శ్రీ శిద్దా వెంకట సుబ్బారావు గారికి అంజలి ఘటిస్తూ...
సోదరులు :
శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా వెంకట క్రిష్ణారావు,
శిద్దా పాండురంగారావు, శిద్దా నాగేశ్వరరావు,
శిద్దా రాఘవరావు, బొమ్మిశెట్టి వెంకట శ్రీనివాసరావు
రాష్ట్ర మాజీ మంత్రివర్యులు
కీ॥శే॥ శిద్దా వెంకట్రావు గారి కుమారులు
శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా సూర్యప్రకాశరావు
శిద్దా హనుమంతరావు
శ్రీ వాసవి గ్రానైట్స్ - చీమకుర్తి
వైకుంఠ సమారాధన: తేది: 08.02.2024 గురువారం చీమకుర్తిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.